# నరకానికి పొలిమేరలు

"ధనిష్ఠ"

సంధ్య బయలుదేరింది. సంధ్య రాకకు సంతసించలేని జలజాప్తుడు పశ్చిమాన క్రుంగిపోతున్నాడు. అంతవరకు అగ్ని కురిపించిన అతని కిరణాలు కెంజాయలలో రంజిల్లుతూ తెలిమబ్బుల మాటున తొంగిచూస్తున్నాయి. కలువలకి సంతోషం కమలాలకి సంతాపం కలిగిస్తూ తప్పుకుంటున్నాడు. కోపంలో ఎఱ్ఱబారిన ముఖంతో సంధ్యకేసి మిఱ్ఱి చూస్తున్నాడు. కాని తన అసమర్థతకు సిగ్గిలుతూ, శీఘ్రగతిని పయనం సాగిస్తూ ఉష పిలుపు విని, తన్నాహ్వానించే ప్రదేశాలకు పరుగిడుతున్నాడు. లేత నీలిరంగు చీర ఎఱ్ఱ జార్జెట్ జాకెట్ వేసుకున్న సంధ్య, నీలిమబ్బుల మధ్య సాయంత్రపు ఎఱుపుతో సంధ్యాదేవి అవతార మెత్తిం దనిపించేటట్టుంది. చేతిలోని వానిటీబాగ్ ఊపుతూ హైహీల్డు శాండల్స్‌తో కటకటా నడుస్తూంది. రెండు వీధులు గడిచి ఒక వీధిలో యింటిముం దాగింది.

ప్రాకారం దాటి లోపల కెళ్లింది. బొమ్మల పుస్తకం తిరగవేస్తూ ఎనిమిదేళ్ల కుర్రాడు సోఫామీద కాళ్లుపెట్టి కూర్చున్నాడు హాల్లో.

"సతీ! అక్కయ్యేదిరా?" అంది వాడితో సంధ్య.

వాడు కిమ్మనలేదు. నిర్లక్ష్యంగా బొమ్మలు తిరగవేస్తూ ఆమె ప్రశ్న ఉపేక్షచేశాడు.

"మాటలు రావుట్రా?" అంటూ వాడి బుగ్గ నులిమింది.

"ఫో! నీతో మాట్లాడను" అంటూ తోసేశాడు బుంగమూతితో.

"అబ్బో! కోపంవచ్చిందే? అబ్బాయికి. ఏమ్మా ఎందుకూ?" అంది అమాయికత నటిస్తూ.

"ఫో! సతీ ఏంటి? అల్లా అంటే పలకను." అన్నాడు.

"ఒహో! అందుకనా? 'సతి' అంటే ఏమిట్రా సతీ?"

"మళ్ళీ అదే అంటున్నావు. మా బావతో చెప్పి ఏం చేస్తానో చూడు" అంటూ రౌద్రరసం ప్రదర్శించాడు.

"పోనీ 'సతీశ్' అనే అంటానుకాని అసలు 'సతి' అంటే కోపం ఎందుకు?" అంది వాణ్ణెత్తుకుని బుజ్జగిస్తూ.

"'సతి' అంటే పెళ్లాంట అక్క చెప్పింది. అల్లా అంటే పలకను" అన్నాడు ముద్దులు గుడుస్తూ.

"సరే అక్కయ్యేది?"

"ఏమో" అన్నాడు మొండిగా.

"అయితే మళ్లీ 'సతీ' అంటా నంతే." అంది చిన్నపిల్లల దెబ్బలాటలోలాగ.

సంధ్య వాడిని మళ్లీ ఏడిపించి ఉడికించే అవకాశం తప్పేలాగ స్వర్ణ రానేవచ్చింది.

"ఏమిటి సంధ్యా వాణ్ణేడిపిస్తున్నావు?" అంది ఎర్రని పెదిమలమీద చిరునవ్వు మెదిలిస్తూ.

"లేకపోతే! వీడికి 'సతీ' అంటోంటే పౌరుషం తలెత్తుతోంది బుగ్గలు నులిమేవాడు లేక," అంటూ వాణ్ణి దింపింది చిరుకోపం ప్రకటిస్తూ.

"మాడక్కా" అంటూ స్వర్ణ చీర చెరగు చాటుకు పరుగెత్తాడు సతీశ్.

"ఏమిటిలా దారితప్పి వచ్చినట్టున్నావ్?" అంది వ్యంగ్యంగా.

"మరేఁ! అందరూ నీలాగే ఉంటారా?" అంటూ సాగదీసింది సంధ్య.

"అవును మరి నీలాగే ఉంటారు" అని ఎత్తిపొడిచింది స్వర్ణ.

"నీకంటె నయమేగా. ఎల్లాగయినా నేనే ముందు రావాలని నీకు పట్టుదల" అని అందుకుంది సంధ్య.

"కాదు సంధ్యా! నీకేం స్వేచ్ఛావిహంగం లాంటిదానివి. సంసారం బెడదా ఏమీ లేదు. చక్కగా యింటిపట్టునుండి చదువుకుంటున్నావు. చీకుచింతల్లేవు. అంచేతే అంతా నీలాగే 'ఆడింది ఆట పాడింది పాట' అనుకుంటున్నావు. నాకల్లా కాదు. ఆయ నింటికి వచ్చేటప్పటికి నే లేకపోతే, పగలల్లా పనిచేసివస్తారాయెను, అదోలా ఫీలవుతారు. అల్లాగని

నా స్వేచ్ఛ నరికడుతున్నారని కాదు. అసలు నాకే బాగుండదు ఆయన వచ్చేటప్పటికి యింటిదగ్గర లేక పోవడం. సంసారం దిద్దుకోవడం అన్నీ నామీదేగా. అంచేత నువ్వు మా యింటికి రావడం సులభం. నేను బయలుదేరాలనుకో. ఇంటా అన్నీ సిద్ధంచేసి తలుపులు తాళాలు సరిగ్గా చూసుకుని, వారికి ఒక చీటీ పెట్టి బయల్దేరాలి. తీరా నాలుగడుగులు వేసేలోగానే ఏ పాలమీద మూత మర్చిపోయినట్టో బీరువా తలుపు లెయ్యడం మర్చిపోయినట్లో జ్ఞాపకం వస్తుంది. ఆయన అన్నీ సరిగా చూసుకుని భోంచేశారో లేదో అని ఊరికే మనస్సు ఆందోళనపడుతుంది. ఎంత చదువుకున్నా యివన్నీ స్త్రీలో సహజంగా మూర్తీభవించిన లక్షణాలు" అంది స్వర్ణ.

"ఎంత చక్కటి ఉపన్యాసం విన్నానూ? రేపటినుంచి రోజుకో గంట ప్రైవేటు చెప్పకుంటే బాగుణ్ణు" అంది సంధ్య చిలిపిగా పకపకా నవ్వుతూ.

"ఎంత పొగరు! యీ యేడాదిలోపున మీ అమ్మగారితో చెప్పి ముక్కుకు తాడు వేయిస్తా. అప్పుడు చూస్తాను యీ వేళాకోళాలన్నీ. 'యీ కంటికి యీ రెప్పలు దూరంకావు. దానికేంలేగాని వేషంచూస్తే ఏదో ప్రయాణసన్నాహం ఉన్నట్టు తోస్తోందే."

"మహిళాసమాజంలో యివాళ మీటింగు ఉంది. మనం వెడుతున్నాముట." అంది ముద్దు లొలికిస్తూ.

"ఏం మహిళాసమాజంలో గద్దెలెక్కి ఉపన్యాసాలు దంచడం తప్పించి కార్యరూపం ధరించే యోగం లేదు. మహిళలని ఉద్ధరిస్తామని పెద్ద కబుర్లు చెప్పే మగాళ్లందరు యింటిదగ్గర ఎల్లా ఉంటారో! ఎవరో చెప్పినట్టు ఆడదానిమీది మోజు పరాయివాడి భార్యగా ఉన్నంతసేపే. లేకపోతే ఉపన్యాసాలు అనర్గళంగా చెప్పడంవరకే. స్త్రీ అభ్యుదయమో అని గోలపెట్టడం వరకేగాని ఎంతవరకు కొనసాగుతోంది? అప్పుడే యిరవయ్యో శతాబ్దంలో పూర్వ భాగం గడిచిపోయింది గదా! యింతవరకు సాగిన అభ్యుదయం ఏమిటి? ఎంత ముందుకు నడిచిందీ ఉద్యమం? వితంతువులని పెళ్లాడడానికి ముందుకు ఎందరు వస్తున్నారు? వచ్చినా ఎల్లాంటి వాళ్ళు వస్తున్నారు? ఎక్కడా చెల్లని మారని రూపాయిగాడెవడో వస్తున్నాడు చేసుకుందుకి. లేకపోతే వాళ్లిచ్చే డబ్బు చూసి కొందరికి, అందంగా ఉన్న వాళ్ళకు పెళ్లిళ్లవుతున్నాయి, డబ్బున్నవాళ్లకు అవుతున్నాయి. ఇంకా అసలు పెళ్లి చెయ్యడానికే వెనుకంజవేసే కన్యాదాతలున్నారు. మగవాడు బహిరంగంగా అవినీతిపనులు చేస్తుంటే సహించిన సంఘం స్త్రీ పొరపాటున వ్యవహరించినంతమాత్రాన వెలివేస్తారు. ఇంక ఆ కుటుంబంలో వాళ్ళకే పెళ్లిళ్లు కావు. పోనీ అది పొరపాటుగా జమకట్టినా, ఆమె ప్రవర్తన కుటుంబంమీద జమ కావడం ఏం బాగుంది? ఒక వేళ కొందరు ముందుకు వచ్చి పరిస్థితుల ప్రోద్బలం వల్ల పతనమైనవాళ్లని పరిగ్రహించినా వాళ్లని ఎల్లా చూస్తున్నారు? నిమిష నిమిషానికీ వాళ్ళ హృదయాలని గాయపరుస్తూనే ఉంటారు. మాటిమాటికీ గతచరిత్ర స్మృతికి తెచ్చి నిరసిస్తూంటారు. ఇటువంటివి భరించలేక ఆత్మహత్య చేసుకున్నవాళ్లెంతమంది?—" ఉపన్యాసం సంధ్య అడ్డుప్రశ్నలో ఆగింది.

"అల్లాగని ఒకమాటు ఒక లెక్చర్ దంచరాదు? లోపాలని ఎత్తిచూపాలని ప్రయత్నిస్తావేగాని ఉడతాభక్తిగా నీచేతనైనంతలో సంఘాన్ని బూజు దులుపుదామని ఉండదేం? నీలాంటివారంతా చేరితేనేగా 'సంఘం' అవుతూంట? నీలాగే ప్రతీ వ్యక్తిలోను మానసిక పరివర్తన కలిగి ప్రతీవాడు తన బాధ్యత గుర్తించి యీ పాపంలో తన పాలెంతో గ్రహించి అధమం తనైనా దీన్ని ప్రతిఘటించాలని అనుకుని హృదయవైశాల్యం పెంపొందించుకుంటే యీనాటికి నువ్వు ఎత్తిపొడిచే 'సంఘం' యిల్లా ఉండేదా? యీ వాదనలకేం గాని యివ్వాళ మనం వెళ్ళక తప్పదు. కావలిస్తే తీరిగ్గా నీ వాదనలన్నిటిని ఖండించడానికి ప్రయత్నిస్తాను. ముందు నాతో రా. యివాల్టికి" అంది సంధ్య.

"ఇప్పుడెల్లాగ? ముందు చెప్పకుండా యిప్పుడు వచ్చి గొంతెక్కి కూర్చుంటే జేజెమ్మలాగ."

"అచ్చే లేదు గిచ్చే లేదు. నువ్వు యివాళ రాకపోతే యింక నీకూ నాకూ రాంరాం." అంటూ చిన్నపిల్లలా కళ్ళు చికిలించి బుగ్గలు పూరించి పిడికిలితో చరిచి శబ్దం చేసింది సంధ్య.

"చాల్లే నేర్చుకుపోయావు మరీను! నెత్తికి యిరవై ఏళ్లు వచ్చినా యింకా సతీశుడితో దెబ్బలాటలు, చిన్నపిల్లల్లా అల్లరీను." అని మందలించింది.

"సుమతీశతకంలా మాట్లాడావు కాని మేకప్ కానీ. 'రాణీగారు చీర సింగారించేటప్పటికి పట్నం మాటుమణిగిం' దన్నట్టు చేస్తావు."

"తప్పుతుందా! శని పడితే ఏడేళ్లు నువ్వు పడితే పద్నాలుగేళ్లు' విన్నాదుల్చుకోలేరు. అయిదునిమిషాల్లో వస్తాను."

"అక్కా నేనో?" అంటూ సతీశ్ వెంబడ బెట్టాడు.

"అల్లాగే బాబూ" అంది స్వర్ణ.

"పోను పేరంటాల్లా వీడెందుకు?" అంటూ గుర్రుమింది సంధ్య సతీశ్ కేసి చూసి.

"ఛా" అని వాడు గసిరాడు.

"ఛీ! ఊరుకో! పెద్దవాళ్ళనల్లా అనొచ్చా" అని గదిమింది సతీసుడిని.

"మరి అది అల్లా అంటుందేం?" అన్నాడు బిక్క మొహం పెట్టి.

"నువ్వు మరీను. వాడితో సమానంగా." అంది సంధ్యతో.

సంధ్య కోపంగా ముఖం పెట్టింది.

"మహా తల్లీ! పొరపాటువచ్చింది. వాడినైనా అనవచ్చు కాని నిన్నండంమాత్రం పీకిమీదకి తెచ్చుకోవడమే" అంటూ నవ్వింది స్వర్ణ, సంధ్య నెత్తిమీద ఆప్యాయంగా చెయ్యి పెట్టి.

సంధ్య కిలకిలా నవ్వింది. సతీసుడు నవ్వాడు. స్వర్ణ నవ్వింది.

"వస్తా మరి" అంటూ స్వర్ణ నిష్క్రమిస్తూ సోఫాలో ఆల్బం చూసి ఆగిపోయింది.

"సతీ! యిది యిక్కడి కెలా వచ్చిందిరా?" అంది తీక్ష్ణంగా.

"మరి, మరేమో నేఁ నీ పెట్టిలోంచితీసి బొమ్మలు చూస్తున్నా" అన్నాడు. అక్క రూపం చూసి బెదిరి మొహం వేలవేశాడు.

సంధ్య ఆ పుస్తకం అందుకుని "ఏమిటదీ? ఆల్బలం ఆఁ? ఎప్పుడూ చూపించనేనా చూపించావు కాదేం మామ్మా? కొరుక్కు తింటామనా?" అంది స్వర్ణమీద నేరారోపణ చేస్తూ.

స్వర్ణముఖంరంగులు మార్చుకుంది. తీక్ష్ణత తొలగి విచారరేఖ లాస్థానా న్నాక్రమించాయి. అది గమనించినసంధ్య చిలిపితనం అణిగిపోయింది. స్వర్ణగద్గదికంగా అంది.

"అందుకు కాదుసంధ్యా, అందులో మా శారద ఫొటో ఉంది. ఫొటో చూపినతరువాత పరిచయం చెయ్యక తప్పదు. అది చెయ్యడానికి నా మనస్సు క్షోభిస్తుంది. ఆమె యిప్పుడు లేదు. ఆమె కథ తెలిసి ఉన్న నేను కుమలడమే కాకుండా అందరికీ తెలియపరచి వారినికూడ నొప్పించడం నా అభిమతం కాదు. అంచేతే ఆ ఆల్బం ఎవరికీ కనబడకుండా దాచేస్తాను. అదే కారణంచేత యింత సన్నిహితంగాఉంటూన్నా నీకు చెప్పలేదీకథ." అంది స్వర్ణ నిట్టూరుస్తూ.

నన్నంత అర్థం చేసుకోగలిగావన్న మాట. రెండేళ్లనుంచి అంత కలిసిఉంటూ ఒకరిబాధలు ఒకరు పంచుకుంటున్నా యీ సంగతినానుండి మరుగుపరిచి నీలోననే కుములుతున్నావన్న మాట."

"తల్చుకుంటేనే భయంవేసి, ఎవరూ నమ్మలేనంతగా ఉండేకథని నీకు చెప్పి నిన్ను నొప్పించి, నేనుకష్టపడి, యిదంతా యిప్పుడెందుకు సంధ్యా? అల్లాంటివి జ్ఞాపకం చేసుకోకపోవడమే మెరుగు. నాకే కాకుండా నీకుకూడ యీబాధ ఆపాదించడం నా కిష్టంలేదు. అదీకాక గత స్మృతులు తల్చుకొని కుంగేకంటె ఆ ఆలోచనలు మానడమే మేలనిపిస్తోంది. అటువంటిదానికి నీకీ కుతూహలం ఎందుకు?"

"ఇంత చదువుకుని నువ్వే వేలవైపోతూంటే ఎల్లా. సాటిస్త్రీలమైఉండీ, స్త్రీజాతి నిర్భాగ్యంగా అనుభవిస్తూన్న కష్టాలను అర్థంచేసుకుని మన చదువుకి సార్థకత కల్గించేలాగ వాటిని నిర్మూలించడానికి కొంతలోకొంతైనా ప్రయత్నించవద్దూ. ఇంకా యిల్లాంటివి ఎన్ని జరుగుతున్నాయో అన్వేషించవలసినబాధ్యతకూడ మనమీద ఉంది. అంచేత అదేదో చెప్పు స్వర్ణా!" అంది సంధ్య ఆవేశంలో.

"పన్నెండేళ్లక్రితం మేము కొచ్చిన్‌లో ఉండేవాళ్ళం మానాన్నగారి ఉద్యోగరీత్యా. నేనప్పటికి ఫస్ట్ ఫారం' ప్యాసైవచ్చి అక్కడ కాన్వెంట్‌లో సెకండ్ ఫారంలో చేరాను. ఒక్కదాన్నే వెళ్ళడం చేత అది మహాబాధగా ఉండేది. ఇరుగుపొరుగు అంతా మళయాళంవాళ్లు. నాకు ఆభాష రాదు. వాళ్ళకు తెలుగు రాదు. క్లాసులో పాఠం వినెయ్యడం యింటికి చక్కా రావడం అల్లా ఉండేది ఎవ్వరూ తోడుండక పోవడంవల్ల. ఇంకో నెల్లాళ్ళకు ఒక అమ్మాయి చేరింది మా క్లాసులో. వాలకం అంతా తెలుగువాళ్ళలాగానే ఉంది. దాంతో నా ప్రాణం లేచివచ్చింది. నాయీడే ఉండేది అప్పటికి. సన్నంగా పొడుగ్గా ఉండేది. కోలమొహం, చామనచాయ, పెద్దకళ్లు చూడగానే నన్నాకర్షించింది. ఆ అమ్మాయికూడా బెరుకుచూపులుచూస్తూ క్లాసులో ఒదిగికూర్చుంది. అంతా కలయజూచింది. మాఇద్దరి కళ్లూ కలుసుకున్నాయి ఒకక్షణం. ఆ ముహూర్తం ఎల్లాంటిదో కాని, అప్పట్లో ఎంతో ఆశ కల్పించి చివరకు చిచ్చుపెట్టింది నా మనస్సులో.

"అవాళ పాఠాలదారి పాఠాలదీ నా ఆలోచనలదారి ఆలోచనలదీ అయింది. యింటర్‌వల్ బెల్ ఎప్పుడు కొడతారా ఎప్పుడు కలుసుకుని మాట్లాడదామా అని జపం చేస్తూ కూర్చున్నాను. మూడుగంటలు మూడుయుగాల్లా గడిచాయి. నా జీవితంలో నిన్న

జరిగినట్టు ఉండి, జన్మాంతంవరకు మరపురాని ఘట్టాలలో మా యిరువురిలోని కలయిక ముఖ్యమైనది. అంచేతే యిప్పుడు నీకు చెప్పతూంటే అదంతా కళ్లకుకట్టినట్టు కనబడుతోంది.—" అని ఆగిపోయింది కంఠం రుద్ధంకావడంచేత.

ఆకథలో యించుమించుపాత్రయి తాదాత్మ్యం పొందుతూన్న సంధ్య ఒక్కసారి త్రుళ్లిపడి స్వర్ణ ముఖంలోకి చూపు ప్రసరించింది. స్వర్ణ కళ్లల్లో యిండుపగింజ లంతంత బాష్పకణా లున్నాయి. శారద స్మృతిస్వర్ణలో కల్గించిన సంతాపానికి సంధ్య మనస్సుకూడ కలవరపడింది. స్వర్ణ హృదయంలో శారదప్రభావం ఎక్కువకాగా ఆనాటి సంఘటనలు ఒక్కటొక్కటిగా జ్ఞప్తికివచ్చి మనస్సు కరిగి కన్నీరుగా ప్రవహించింది. తలపులవలలో చిక్కుకున్న మెదడు ఆలోచనాప్రభంజనాలతాకిడికి తట్టుకోలేక గొంతుకలో రాయి అడ్డువేసి తప్పకోజూచింది. ఆరాయి బయటపడడానికిచేసిన ప్రయత్నం ఎక్కిళ్ళలోకి దిగి ఏడుపుగా విజృంభించింది. స్వర్ణనూరార్చి ఊరుకోపెట్టవలసినబాధ్యత సంధ్యపైన పడింది. రుమాలుతో కళ్లు తుడిచి అనునయవాక్యాలతో ఉపశమనం కల్గించి కథ సాగింపజేసింది. స్వర్ణ మళ్ళీ అందుకుంది.

"ఇంటర్ వల్ లో ఇద్దరం కలుసుకున్నాం. శారద ముఖంలో కళలన్నీ కప్పేంత స్ఫుటంగా విచారరేఖలలముకొని ఉండడం అప్పుడే పసిగట్టాను. ఆ విశాల నయనాలమాటున కారుమేఘాలు కమ్ముకున్నాయని వెంటనే అవగాహన అయింది. నిండా పన్నెండేళ్లు లేని శారదకి అంత విచారం ఎందుకు వచ్చిందో ఆ క్షణంలో అర్థంకాలేదు. నేను కదిపి ఎంతో మాట్లాడిస్తే చాలా ముభావంగా సమాధానాలు చెప్పింది. అప్పటికి నెల్లాళ్లక్రితమే వాళ్ల నాన్నగారు శంకరరావుగారు హార్బర్లో యింజనీరుగా వచ్చినట్టు—చాలా క్లుప్తంగా చెప్పింది. అది మా పరిచయానికి నాంది. సాయంకాలం ఎంతో బలవంతంమీద దారిలోనే గనక మా యింటికి వచ్చింది. మా అమ్మావాళ్లు యింకో తెలుగు వాళ్ల పరిచయం కలిగినందుకు చాలా సంతోషించారు. అల్లా మా యిద్దరి పరిచయం మా యిరువురికే కాకుండా మా రెండు కుటుంబాల మధ్యా త్రెంచరాని సంబంధం చేకూర్చి ఆహ్లాదాన్నాపాదించింది. మా పరిచయం వృద్ధిపొంది ప్రగాఢ మైత్రి ఏర్పడింది మా యిద్దరిమధ్యా. మా మైత్రి వృద్ధిపొందుతూన్నా శారద వ్యథకి కారణం అరయడానికి నాకు ధైర్యం చాలేదికాదు. ఇలా రోజులు దొర్లిపోతూన్న కొద్దీ నాచనవు స్నేహాలవల్ల శారద మనస్సు తృప్తిపడి కొంత కొంతగా ముభావత వదల్చుకొని సంతోషంగా ఉండడానికి ప్రయత్నించేది. వాళ్లయింటికి మా యింటికి మధ్య రాకపోకలు అధికమయ్యాయి. శతాబ్దాల సాన్నిహిత్యం వెల్లివిరిసింది. శారదకి ఒక చెల్లెలు ఒక తమ్ముడు ఉండేవారు. శారద తల్లి సుభద్రమ్మగారుకూడ కలుపుగోరుమనిషే. అందరి తత్వాలు ఒకటే కావడంవల్ల నాలుగు నాళ్లల్లోనే విడిపోయే విధంగా ఉండేదికాదు మా సన్నిహితత్వం. శారదా నేను రోజూ కలుసుకునేవాళ్లం. శెలవురోజుల్లో ఎవరో ఒకరింట్లో ఉండిపోయేవాళ్లం. శారద రాకపోతే నేనూ, నే రాకపోతే శారదా, స్కూలుకి వెళ్లేవాళ్లమే కాదు.

"శంకరరావుగారు స్నేహానికి ప్రాణం అర్పించే మనిషి. ఆయనకున్న యింజనీరింగు క్వాలిఫికేషనే కాకుండా వేదాంతం, సంగీతం సాహిత్యం ఆయనకి అత్యంత అభిమాన విషయాలు. శారదలో చిన్నతనంలోనే అంత అర్థజ్ఞానం కలిగి పరిస్థితులని అవలోకించ గలిగిన నేర్పుకు ఆయనే కారణం. నాకు క్లాసు పాఠాలలోనే తప్ప సాహిత్యవిషయాలలో అట్టే ప్రవేశముండేది కాదు. కాని ఆ రోజులలోనే శారద భారత భాగవతాలకు అర్థం చెప్పగలిగినంత పరిజ్ఞానం కలిగిఉండేది. శంకరరావుగారికి పిల్లలంటే మహా ఆపేక్ష. ఇంటిదగ్గ రున్నంతసేపూ తన హోదా, వయస్సు, అన్నీ మర్చిపోయి మాలో ఒకరైపోయేవారు. శారద మూర్తీభవించిన తండ్రిపోలికే.

"ఒకనాడు మే మందరం బొమ్మలపెళ్లి చేద్దామనుకున్నాం. శారదను వప్పించేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చింది. అది వాళ్ల నాన్నగారికి ఎరుకపరిచాం. శారదకి సంతోషం కల్పించే యీ విషయం వినేటప్పటికి ఆయన పొంగిపోయారు. సరే యిళ్లల్లో ఎందుకు ఆల్వాయ్ వెడదామన్నారు. ఆ రోజొక మరువరానిదినం. మా యిద్దరి జీవితాలు పెనవేసుకొని అత్యంత సాన్నిహిత్యం ప్రసాదించిన రోజు.

"తెల్లారకట్టేలేచి అంతా బయలుదేరాం మా కారులో. ఆల్వాయ్ చిన్నది. స్వచ్ఛమైన నీరు. బోటుషికారు చాలా హాయిగా ఉంటుంది. చుట్టూ కొబ్బరితోటలు. ముందే చేసిన ఏర్పాటు ఫలితంగా రెస్టుహౌసు మాకు యిచ్చారు. వంటలూ అవీ అక్కడ కానిచ్చారు. పడవ అద్దెకు తీసుకుని నదంతా తిరిగి తిరిగి. అపరాహ్నం తిరిగేటప్పటికి స్నానాలు కానిచ్చాం. అవాళ శంకరరావుగారు అంతా చంటిపిల్లవాడై పోయారు. మాలో ఒకడైపోయి మాకు తెలీని సంగతులెన్నో విశదపరిచారు. పంచాంగం చూసి సాయంకాలం ముహూర్తం పెట్టారు పెళ్ళికి. హడావిడిగా గడిచింది. నిజంగా పెళ్ళికి జరిగినంత హడావిడి జరిగింది.

"రాత్రికి శంకరరావుగారు మంత్రాలు చదువుతూండగా బొమ్మలకి పెళ్ళిచేశాం. అంతా పడుకున్నారు. అంతసేపూ ఎంతో ఉత్సాహంగానూ, ఆనందంగానూ గడిపిన శారద మేమిద్దరం ఏకాంతంగా ఉండగానే భోరున ఏడ్చేసింది. అప్పటి నా వయస్సుకు నాకు వచ్చిన మాటల్తో ఓదార్చి సంగతేమిటని అడిగాను. ఎంతో బ్రతిమాలినమీదట చెప్పింది.

"ఇక్కడ ముందు వాళ్ళకుటుంబ ప్రసక్తితేకపోతే కథలో ముఖ్యవిషయమే దెబ్బతింటుంది. శంకరరావుగారు చిన్నప్పుడంతా కష్టాలలో దారిద్ర్యంలో గడిచి కేవలం స్వయంకృషివల్ల, తెలివితేటలవల్లా పైకి వచ్చారు. ఆ కారణంగా ఆయన లో కష్టాలు జీర్ణించి హృదయం మెత్తనై అనుభూతి పెంపొందింది. నా ఎరుకలో శరత్ విషాదాంత నవలలు చదివి ఆయన కన్నీరు స్రవించిన ఘట్టాలున్నాయి. ఉద్యోగంలో ప్రవేశించగానే తను తక్కువ ఖర్చుపెట్టుకుని తమ్ముళ్ళకి అప్పచెల్లెళ్ళకి ఎక్కువ ప్రాధాన్యం యిచ్చేవారు. ఇల్లాగ ఆయన రైల్వేలో యింజనీరుగా పనిచేసిన పదసంవత్సరాల కాలంలో అన్యాయార్జితం లేకపోవడం, న్యాయార్జితం అంతా ఖర్చుఅయిపోవడం జరిగింది. ఉప్పు సత్యాగ్రహం అవీ ముమ్మరంగా జరుగుతూన్న రోజులలో స్వాతంత్ర్య కాంక్ష అణచుకోలేకా, ఉద్యోగానికి తిలోదకాలు యిచ్చుకునే ధైర్యంలేకా ఖద్దరు నూల్లునెయ్యడం, హేటుకు బదులు తలపాగలు చుట్టడం, దేశనాయకులను జైళ్లలో కలుసుకొని ప్రణామా లాచరించడంలో సంతృప్తి పడేవారు. ముక్కుకు సూటిగా పోయేవారికెప్పుడూ రోజులు బాగుండవు. ఆయన చేసిన ఆమాత్రపు స్వాతంత్ర్యోద్యమ ప్రవేశమే ఆయన ఉద్యోగానికి ముప్పు తెచ్చింది.

"అల్లా ఉద్యోగం పోయేసమయానికి తక్కినవారిలాగ వేలు చేసుకోలేకపోవడం మూలాన ఆయన పరిస్థితి కుంటువడింది. స్థిరమైన ఉద్యోగం అంటూ ఉండేది కాదు. సుభద్రమ్మగారు ఆయన సంపాదనలో నే మిగిల్చిన డబ్బు ఉద్యోగం లేకుండా ఉన్న రోజులలో ఖర్చయిపోతూండేది. ఒక స్థాయికి అలవాటుపడ్డ జీవితాలు ఒక్కసారిగా క్రిందకు దిగిపోలేకపోవడంచేత ఖర్చు, హోదా, మాత్రం ఉద్యోగం ఉండడం లేకపోవడాలతో ప్రమేయం ఉండేదికాదు. ఇలా గడుస్తూండేసరికి శారదకు పదో ఏడు వచ్చింది. సుభద్రమ్మగారి తత్వం ఎక్కువ దూరాలోచన చేసేరకం. అది మిగతా విషయాలలో సహాయకారిగా ఉన్నా శారద విషయంలో మాత్రం ఆమె జీవితానికి గొడ్డలిపెట్టు అయింది. భర్త ఉద్యోగానికి నిలకడలేకపోవడం కూడబెట్టిన మడి మాన్యాలేమీ లేకపోవడం పిల్లలకు పెళ్ళిళ్ళెలాగో, సంసారం గడవడ మెలాగోననే దిగులు, బెంగ, ఆమెను పీడించేవి. అందులో ఆవిడ దృష్టికిగల పరిధిలో శారదకు పెళ్ళీడువచ్చి దాటిపోవడానికి సిద్ధంగాఉంది. శారదకు యిద్దరు మేనమామలు. రెండోవాడు విశ్వం అవివాహితుడు. అప్పటికే యిరవైఏళ్లుండేవి. చదువు సంధ్యలు అబ్బకపోయినా ఆస్తిమాత్రం చాలా ఉంది. శారద అమ్మమ్మ సుందరమ్మగారికి శారదను కొడుక్కి చేసుకోవాలని ఉబలాటం ఉండేది. ఆ ప్రసక్తి కూతురిదగ్గర ఎత్తింది. తను అత్తగారిలా కాకుండా అమ్మమ్మలా ఆదరిస్తాననీ, బావగారుకూడ మేనమామే అవడంవల్ల అరమరికలు ఉండవని ఆవిడ కూతురికి నూరిపోసింది. పరిస్థితుల ప్రభావంవల్లా తన దృష్టికిగల పరిధి తక్కువ కావడంవల్లా సుభద్రమ్మగారికీ మాటలు బాగా తలకెక్కాయి. తన భర్త ఉద్యోగపు హోదాకు ఆ సంబంధం తగదని, వరహీనమని ఆమెకు తోచలేదు. పైగా యీ సంబంధం దాటబెట్టుకుంటే కన్నవారికి దూరమవడమేకాకుండా శంకరరావుగారి ఉద్యోగస్థితి తెల్చుకొని పిల్లలకు పెళ్లిళ్లే చెయ్యలేమేమోననే మనోవేదనలో పడిపోయింది. ఆ విషయం ఆమెకు ఆలోచించినకొద్దీ అత్యంత సహజంగానూ, సమంజసంగానూ కనబడింది. ఆ విషయంలో భర్తను ప్రేరేపించింది, వప్పించడానికి శతథా ప్రయత్నించింది. ఆయన పరిస్థితి ఆయనకు ఎరుకపరిచి భయపెట్టింది. బుద్ధిః కర్మానుసారిణీ అని ఎందుకంటారో యిల్లాంటివి వింటే స్పష్టపడుతుంది. ఇతర విషయాలన్నింటిలో తన యిష్టానుసారం వ్యవహరించే శంకరరావుగారు సుభద్రమ్మగారి మాటలకు లొంగి బలహీనత కనబరచడం శారద దురదృష్టం కాకపోతే మరేమిటి? పరిసితుల ప్రభావంవల్లనైతేనేమి శారదని వెన్నాడిన దురదృష్టమేకాని, మొత్తానికి అన్నీ సమకూడి శారద పెళ్ళి విశ్వంతో స్థిరపడింది.

"శంకరరావుగారికి జీవితంలో చెయ్యబోయే మొట్టమొదటి కన్యాదానం కావడంవల్ల, ఏర్పాట్లన్నీ పెద్ద ఎత్తున జరిగాయి. ఎన్నాళ్ళనుంచో ఎదురుచూసిన ముహూర్తం రానేవచ్చింది. అది అత్యంత దుర్ముహూర్తంగా పరిణమించింది శారద పాలిట. పెళ్ళిపీటలమీద మంగళసూత్రధారణ జరిగిన అనంతరం వధూవరులను లోపలకు తీసుకువెళ్ళే సమయానికి, విశ్వానికి మతి చలించింది. అటునించి కేకలతో పరుగెత్తి నూతిలో దూకాడు. అందరూ ఉండి బయటకు తీశారు. విశ్వానికి అంకురించిన మనశ్చాంచల్యం వంశపారంపర్యంవల్ల సంక్రమించింది.

ఈ సంఘటనతో యింక పెళ్లి ముందుకు సాగలేదు. తన కన్నకూతురి కుత్తుక యీ విధంగా తెగి

పోవడంతో శంకర్రావుగారి హృదయం ఆగిపోయి సంత పనైంది. ఇతరుల కష్టాలకే ద్రవించే మనస్సుగల ఆయన యీ సంఘటనకు తట్టుకోలేక క్రిందపడి విలవిల తన్నుకున్నారు. ఎంతమందో కలిసి ఓదార్చలేకపోయారు. సుభద్రమ్మగారి మనస్సు ముక్కలైంది. ఈ వైపరీత్యానికి తన ప్రోత్సాహమే కారణం కావడం బిడ్డ గొంతు తన చేతులతోనే ఖండింపబడటంతో ఆమె మూర్ఛిల్లింది. ఎన్నాళ్లనుంచో ఉన్న గుండెజబ్బు విజృంభించింది. అంత క్రితం గంటకు ముందు అందాల పాలవెల్లిగా వెలసిన పెళ్ళిపందిరి శోకనిలయం అయిపోయింది. సుభద్రమ్మగారికి తగ్గేటప్పటికి రెండు నెలలు పట్టింది. శంకర్రావుగారు పిచ్చెత్తినట్టుండేవారు. ఆయన వేదాంతం విజ్ఞానం యీ విషయంలో ఓదార్పు చేకూర్చలేకపోయాయి. అభ్యుదయ భావాలలో మెలగే ఆయన ఆలోచనలిల్లా డొంకలుపట్టి పదేళ్ళు నిండని కూతురుకి పెళ్ళిచేయించడం ఆయనే సహించలేకపోయారు. తన ప్రథమ సంతానానికి తను ఎంతో ముద్దుగా పెంచి పెద్దచేసిన శారదకే యిట్లాంటి యిక్కట్టు రావడంతో ఆయన క్రుంగిపోయారు. దానికి ప్రతీకారంగా యీ పెళ్ళి జరగనట్టే భావించమని అత్తగారికి ఉత్తరం వ్రాశారు. శారద పుస్తెలు తెంపేశారు. ఆ ఉద్యోగం వదిలేసి ఏడాదిపాటు యించుమించు అజ్ఞాతవాసంచేసి యిక్కడకు వచ్చారు. అవి ముగించింది శారద. అప్పటినుండి శారదకు ఏ పూర్వస్మృతులు కలగకుండా, ఆమె సుఖానికి ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉండేవారాయన. అప్పటినుంచీ శారదకు, వేదాంతం, భగవద్గీత, భారత భాగవతాలు చెప్పేవారు. స్కూలులో జేర్పించారు యిక్కడ. ఆ పెళ్ళి అవనట్టే భావించడానికి ప్రయత్నించేవారు. కాని ఆయనలో నాటుకొని, నరనరాన జీర్ణించి ఉన్న పూర్వ సాంప్రదాయపు ఛాయలు స్త్రీకి ద్వితీయ వివాహాన్ని ప్రతిఘటించేవి. ఆవాళ్ళ శారదను ఎంతో ఓదార్చి ఊరుకోబెట్టవలసివచ్చింది. మా యిద్దరి స్నేహం ఆవాళ్ళనుంచి నూత్నంగా అభివృద్ధి పొందింది. అదే యీ నాటికిగూడ అశ్రువులు రాల్పిస్తోంది. నాజీవితం ఉన్నంతవరకు అది మర్చిపోలేను." స్వర్ణ ఆగి మళ్లీ కన్నీళ్లు తుడుచుకుంది.

"దుఃఖంగా ఉంది కథ. శారదకెంత గతి పట్టింది?" అని వాపోతూ సంధ్యకూడ స్వర్ణతో శ్రుతి కలిపింది.

"దీనికే నువ్వింత బాధ ప్రకటిస్తున్నావే, ముందర చెప్పబోయేదానిలో యిది ఆవగింజంతయినా లేదు. అందుకే నే నీ విషయం యితరులదృష్టికి మరుగుపరుస్తున్నాను. జరిగినదానికి విచారించి ప్రయోజనంలేదని తెలిసీకూడ వగవకుండా ఉండలేం. మానవులలో యిదొక ప్రాథమికదౌర్బల్యం. దాన్నించి ఎవ్వరూ తప్పుకోలేరు.

"తరవాత ఏమైంది?" అంది సంధ్య ఆత్రుతగా కథాశ్రవణ కౌతుకంతో.

"మే మున్న రెండేళ్లు మొత్తానికి బాగానే గడిచిపోయింది. ఈలోపున శారద వ్యక్తురాలయింది. మా నాన్నగారికి ట్రాన్స్ఫరై మేం మెడ్రాస్ వెళ్ళిపోయాం. మే మక్కడ ఉండగానే సుందరమ్మగారు వాళ్లువచ్చి పూర్వసంబంధాలను పునరుద్ధరించడానికి ప్రయత్నించారు. కాని శంకర్రావుగారు మాత్రం అంగీకరించలేదు. వాళ్లు విసిగివేసారి తిట్టి వెళ్లిపోయారు.

"తరువాత హార్బర్ కన్‌స్ట్రక్షన్ అయిపోయి శంకరరావుగారికి ఉద్యోగంపోయింది. పరిస్థితి వెనకటికివచ్చింది. మెడ్రాస్ వచ్చేశారు. మళ్ళీ మా యిద్దరి తాత్కాలిక వియోగం అంతమొంది కలయిక ప్రబలం అయింది. శంకర్రావుగారు, తన మనస్సే అంగీకరించకపోయినా, సంఘాన్నెదిరించే శక్తి తనకు లేకపోయినా, కూతురికోసం సర్వస్వంత్యాగం చేసైనా ఆమెకు మళ్లీ పెళ్లిచేద్దామనుకున్నారు. ఈ విషయంలో హిందూసమాజం చాలా క్రూరంగా ప్రవర్తిస్తుంది. అందరూ వెలివేస్తారు. తక్కిన పిల్లలకుగూడ ఆ మచ్చేవచ్చి, పెళ్ళిళ్లు జరగవు. బంధుత్వాలు నశిస్తాయి. యిప్పటికింత అభ్యుదయం సిద్ధించినా ఎవ్వరూ సాహసించలేక పోతున్నారే అల్లాంటిది ఆ రోజుల్లో ఎవరు ముందడుగు వేయగలరు? శారదకు ద్వితీయ వివాహం సంకల్పించడంలో అభ్యుదయ భావాలుగల తన స్నేహితుల సలహా కోరారు శంకర్రావుగారు. సంఘాన్నెదిరించి ఏమీ చెయ్యలేమనీ, తక్కిన పిల్లలకు పెళ్లిచెయ్యడం కష్టమౌతుందని వారు సూచించారు. అదీకాక అనాఘ్రాత ప్రసూనమైనా శారదను చేసుకుందుకు ముందుకువచ్చే వాళ్లెవరూ తమ తాహతుకు సరిపోయిన వారు కనబడలేదు. ఎక్కడ సంబంధాలు దొరకనివాళ్లు, డబ్బుకు ఆశపడే వాళ్లు మాత్రమే ముందుకు వస్తారిల్లాంటి విషయాలలో. ఒక ఉరి తప్పించి మరో ఉచ్చుకు తల దూర్చడం కంటే మళ్లీ పెళ్లివల్ల ప్రయోజనం లేదని ఆ రోజుల పరిస్థితుల కనుకూలంగా సలహా లిచ్చారు స్నేహితులు.

"ఈ రెండేళ్లలో విశ్వంగారికి పిచ్చినయం కావడం మామూలుగా ఉండడం జరిగింది. అంచేత శారదను పంపడం విషయంలో వత్తిడి ఎక్కువ కాజొచ్చింది. శంకరరావుగారికి ఉద్యోగం లేకపోవడం అనువుగా గ్రహించి సుభద్రమ్మగారిని భయపెట్టుం

మొదలు పెట్టారు ఆమె తల్లీ సోదరుడూను. లేకపోతే మరో సంబంధం చూసుకుంటామని బెదిరించారుకూడ. మొగవాడికి వాడి, రూప, గుణ, శీలాలతో సంబంధం లేకుండా, ఎంతమందైనా, ఎన్నో పెళ్ళికైనా పిల్ల నివ్వడానికి సిద్ధమౌతారు. ఇది సంఘంలో నిషిద్ధం కాదు. పురుషుడు పతనమవడాన్నంగీకరించి కొన్ని విషయాలలో ప్రోత్సహించే సంఘం, స్త్రీలో అది పొరపాటునగూడ సహించదు. పరిస్థితుల ప్రోద్బలం, తన అసహాయత, హిందూశాస్త్రాలలో తనకుగలనమ్మకం, సంఘంమీద ఉండేగౌరవం, 'అటునించి నరుక్కు' రమ్మనగల ధైర్యంలేకపోవడవల్ల శంకరరావుగారు శారదను పంపడానికే నిశ్చయించారు. శంకర్రావుగార్ని అన్నివిధాల భయపెట్టి, ఆయన బలహీనతను గుర్తించి వేలు ఎత్తి చూపింది సుభద్రమ్మగారు. దాంతో ఆయనకు విరక్తి ఆవరించేది. సుభద్రమ్మగారి దూరాలోచన శారద విషయంలో దురాలోచనగా పరిణమించింది. శారదను మళ్ళీ పంపడంలో కూడ, ఆమె ప్రోత్సాహం, పరిస్థితుల్ని ఎదుర్కోలేని బలహీనతా, భవిష్యత్పరిణామాలపై లేనిపోని అపోహలు పెంచుకోవడం, దోహదం యిచ్చాయి.

"శారద అత్తవారింటికి వెళ్ళింది. అక్కడనించి కథ యింకో ధోరణిలోకి వస్తుంది. పల్లెటూరి వాతావరణంలో పుట్టి పెరిగిన విశ్వం గొంకు, సంకుచిత హృదయం పెంపొందించుకున్నాడు. అతనికివ్యక్తిత్వం నశించింది. దానికి కారణం ఆయన తల్లే. ఏ విషయంలోను స్వతంత్రంగా ఆలోచించనివ్వక, కొంగున కట్టుకుని తిరిగి ఏ విషయంలో తనకు ఏమి కావలసినా ధైర్యంగా అడగగల శక్తిని కోల్పోయేటట్టు చేసింది. తనకు జరిగే అన్యాయాలను ప్రతిఘటించగల శక్తికూడ ఆయనలో అంతరించింది. తనకు అన్నకు జరిగే చిలిపి తగువుల్లో తనవైపున న్యాయమున్నా, అన్యాయమున్నా, శిక్ష తనకే తగిలే వాతావరణంలో పెరిగాడు. ఎన్ని ఏళ్ళు వచ్చినా 'కానీ'దగ్గరనుండి తల్లిదగ్గర తీసుకోవడమే. అతను ఏ విధమైన అభిప్రాయం వెలిబుచ్చినా జడ్డివాడుగాను, మందమతివాడుగాను జమకట్టే అభిప్రాయాలకు విలువ యిచ్చేవారు కారు. చెడిపోతాడని అదుపుఆజ్ఞల్లో పెట్టజూచేవారు. సాధారణంగా మన యిళ్ళల్లో పిల్లలు చెడిపోవడానికి యిదో కారణం. కొన్ని పనులు చెప్పి యివి చేస్తే వీపు చీరేస్తామని బెదిరిస్తారు. ఉదాహరణకి సిగరెట్లు. శాసనాన్ని ఉల్లంఘించడంలో ఒక ఆనందముంది. సాధారణంగా మన్ని ఏ పని చెయ్యవద్దంటారో అది చెయ్యడంలోనే మనకి ఒక సంతృప్తి ఒక ఆనందం వస్తుంది. సిగరెట్లు కాల్చవద్దనకపోతే అవైపే మనస్సు పోదు. కాని 'కాల్చవద్దు' 'చెడిపోతారు' అని చెప్పినప్పుడు ఆ చెడిపోవడ మేమిటో చూడాలని పట్టుదల బయలుదేరుతుంది. అ కేరకపు మనస్తత్వం అభివృద్ధి అయింది విశ్వంలో. కాని ఆయన ఆ శాసనోల్లంఘనంలో గూడ ఆనందించలేనంత భయానికిలోనయ్యేవాడు. అదే అతని దృష్టికిగల పరిధిని పరిమితం చేసింది.

"శారదతో పోలిస్తే తనస్థితి, తనసంస్కృతి ఎంతతక్కువో మాత్రం ఆయన గ్రహించాడు. ఒక స్థానానికి అర్హుడుకానివాడికి అది సంప్రాప్తిస్తే, దానికి తగనని తనకే తెలియడంవల్ల, ఆ విషయమై యితరు లేమనుకుంటున్నారోననే అపోహ అపరిమితంగా ఉంటుంది. తన్నందరూ అవహేళన చేస్తారనే ఆందోళనకు పాలవుతాడు. తనహోదాకు గల అధికారంలో తనెంతవరకైతే దాన్నణచగలడో అంతా ప్రయత్నిస్తాడు. ప్రేమను, స్త్రీలనుగురించి చౌకబారు అభిప్రాయాలు గల విశ్వం తను శారదకి అర్హుడైన భర్త కాకపోవడంచేత ఆమె తన్ను ప్రేమించదని, తన్నెంతసేపూ లోకువగ చూస్తుందనే తప్పుధోరణిలో పడిపోయాడు. ప్రేమ అనేది ఒక వస్తువుకాదు యిచ్చవచ్చినప్పుడు కొనుక్కోవడానికి. బాల్యవివాహాలు యిప్పటివరకు మన సంఘంలో జరిగినా ఎక్కువ అన్యాయం జరగకపోవడానికి కారణం చిన్నతనంలో పెళ్ళయి అప్పటినుంచే అభిమానం యిష్టంగాను, యిష్టం ప్రేమగాను మారుతూవచ్చి సంసారాల్లో చికాకు లేకుండా చేసేది. అందుకనే, మన మెంత మొత్తుకున్నా, మనం వాపోయి, అపోహ పడినంత నష్టమేమీ జరగలేదు బాల్యవివాహాలవల్ల. శారదపరిస్థితిలో అంతవరకు మేనమామగా వ్యవహరించినవిశ్వాన్ని భర్తగా చూడవలసిరావడంతో ఒకవిధమైన హైన్యం కనబడేది. అదీకాక స్వతః ఆమె గంభీరురాలు. వాళ్ళ పుట్టింట తక్కిన పల్లెటూళ్ళలోలా చిన్నప్పటినుంచే పెద్దకబుర్లు చెప్పడం, సంసారవిషయాలు అవీ తెలుసుకుని యీడుకు తగని పెద్దరికంతో వ్యవహరించడం అట్లాంటి అలవాట్లు లేవు. ఆ కారణంగా వెళ్ళిన మర్నాటినుంచే అందరిఎగుటా భర్తతో మాట్లాడటంలాంటివి చేసేదికాదు. అందుకని విశ్వం ఆగ్రహం పూనేవాడు. ప్రపంచంలో తనెవరిమీదనైనా అధికారం చెలాయించగల హక్కు ఉన్నట్టయితే ఆపదార్థం తనభార్యే అయింది విశ్వం విషయంలో. తనకు గల అధికారాన్నంతా భార్యమీద ప్రయోగించేవాడు. అది శారద సహించలేకపోయేది. తనయీడుకు తగినసంతోషం అనుభవించనిచ్చేవాడు కాదు. ఇంట్లో అందరూ పెళ్ళిళ్ళకు పేరంటాలకు వెళ్ళినప్పుడు సహజకౌతుకంచేత ఆమెకూడ బయలుదేరితే ఆమెపోకడ నరికట్టేవాడు. ఇనుపకటకటాలలో పెట్టి బంధింపజూసేవాడు.

ఇలా రెండేళ్లు గడిచింది. శారద యీ లోపున పుట్టింటి కొకసారి వెళ్లివచ్చింది. శంకర్రావుగారు కష్టాలనుభవించడం ఎల్లాగో చెప్పేవారు. పుట్టింట ఉన్నన్నాళ్లు తమ్ముడితోను, చెల్లితోను హాయిగా గడిచిపోయేది. కాని యింటికి రాగానే మళ్లీ ఎప్పటి ఆతిథ్యమే. చిన్నతనంవల్లా పుట్టింట తిను పెట్టి పుట్టిన స్వేచ్ఛవల్లా యీ పంజరపు బ్రతుకు భరించలేక ఆత్మహత్యకు ప్రయత్నించి విఫలురాలయింది. అదివరకు రెండుదినాలుగా శారదలో మార్పు కనిపెట్టిన సుందరమ్మగారు సమయానికి అడ్డుపడి ఆమె ప్రాణం కాపాడారు. ఆ పట్టున ఆమెను వదలివేసినా ఆమె ఆత్మకు శాంతి చేకూరేదేమో. ఈ విషయం శంకరరావుగారికి తెలిసి గుండె బాదుకొంటూ వచ్చి శారదను తీసుకొని వెళ్ళారు. శారద పుట్టింటికి వెళ్ళినప్పుడు మాత్రం నాకు ఉత్తరాలు రాస్తుండేది. ఆత్మహత్యా ప్రయత్నానంతరం యిల్లా రాసింది.

'... నేను ఆత్మహత్య చేసుకోబోయానని అందరూ నన్నధిక్షేపించారు. అసహ్యించుకున్నారు. భర్తంటే ప్రేమ గౌరం లేదని మా అమ్మమ్మ, ఆయనకూడ అంటారు. చిన్నతనంలో మామయ్యగా మెలిగిన వాడితో, 'నువ్వు,' 'నువ్వు' అని వ్యవహరించిన వాడితో కాపురం చెయ్యవలసి వచ్చినప్పుడు దృక్పథంలో విపరీతమైన మార్పు తేవాలి. అది రెండు రోజుల్లోనే జరిగేపనికాదు. ఆత్మహత్య నీచమని, పిరికివాళ్లుగాని దానికి పూనుకోరనీ తెలియక కాదు. కాని నా హృదయం ఎంత దెబ్బతిందో అడుగడుగునా ఎంత వేదన ఓర్చుకోవలసి వచ్చిందో నీకు చెప్తే నువ్వర్థంచేసుకోగలవు గనక రాస్తున్నాను. హిందూశాస్త్రాలలో నాకు మా నాన్నగారి పోలికవల్ల చాలా నమ్మకముంది. భర్తని హేళన చెయ్యవలెననే అభిమతం కాదు నాది. కాని ప్రతివిషయంలోని హైన్యము ఆయనే ఫీలయి నా హృదయాన్ని గాయపరుస్తుంటే ఎల్లా? హిందూశాస్త్రంలో నమ్మకమున్న నాకు పునర్జన్మలోగూడ నమ్మకముంది. ఇంతకంటే కష్టభూయిష్టమైన, నికృష్టమైన జన్మే లభించవచ్చు మళ్లీ. పిరికివాళ్లలాగ ఆత్మహత్యకు పూనుకోకుండా ధైర్యంగా నిలబడడం నాకు యిష్టమే. కాని స్త్రీ సహజంగా అబల. ఆమెను సర్వదా రక్షిస్తూ శుభాన్ని కాంక్షిస్తామనే సమాజ సభ్యులే ఉక్కుతాళ్లతో బంధింపజూస్తారు. కష్టాలు సహించిన కొద్దీ కష్టాలనుభవించి, ఎదుర్కోగలశక్తి వృద్ధిపొందుతుందని నాన్నగారంటారు. నిజమే. కాని యిలా బ్రతికి ఎవరి నుద్ధరించడానికి. నాకోసం ప్రాణాలర్పించే తండ్రి ఉన్నారు. జన్మమారితే యీ తండ్రికి దూరమౌతాననే ఒక్క బాధే నాకు. ఏళ్లు తక్కువైనా నన్ను నీలా అర్థం చేసుకున్నవాళ్లు నువ్వు, రెండోవారు మా నాన్నగారు. కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టోలో క్షణికోద్రేకాలవల్ల ప్రాణాలు తీసుకోవడానికి ప్రయత్నించి ఎవరివలనో బలవంతంగా ప్రయత్న విరమణచేసి భవితవ్యంలో ఆ వేళ చచ్చిపోనందువల్ల కలిగిన సంతోషాన్ని అనుభవించి ఆ క్షణికోద్రేకానికి పశ్చాత్తాపపడినవాళ్ళని గురించి నాన్నగారు చదివి చెప్పారు. ఆయన యింకా చెప్పారు. చావు అనేది మనం ఎప్పుడు కోరుకుంటే అప్పుడు లభించేది. మందులు తాగితే వాటి రుచి తెలియచెప్పేలోగా మరణింపజెయ్యగలవికూడ ఉన్నాయి. అవి పరిస్థితినిబట్టి వాడుకోవాలి. ఇక యీ జన్మలో మనం సాధించలేనిదేమీ లేనప్పుడు, యీ బంధిఖానాకు అన్ని దారులు మూయబడి అత్యంత నిస్సహాయత అనుభవించవలసిన ఘట్టాలలోగాని అటువంటి పనికి పూనుకోకూడదు. కాలికి ముల్లు గుచ్చుకున్నప్పుడే ప్రాణం పోతుందేమోనన్నంత భయపడితే అంతకన్న కష్టం వచ్చినప్పుడు ఆత్మహత్య శరణ్యమౌతుంది అంటారు నాన్నగారు. అంచేత ముందర అంతకంటె ఎక్కువ కష్టంలో ఎలా ప్రవర్తించాలో ఆలోచించడానికి ప్రయత్నిస్తే అప్పటికి వచ్చిన నిర్లిప్తత తొలగిపోతుందంటారు. ఇప్పుడు తిరిగి చూసుకుంటే అదే నిజమనిపిస్తుంది. నాన్నగారింకా బ్రతికుండగానే నేనీ పనికి పూనుకోవడం ఎంత తెలివితక్కువో ఆయన నన్ను చూడగానే వాపోయి ఆడవాళ్ళలా ఏడవడంవల్ల తెలిసింది. జీవితంలో తిరిగి చూసుకుంటే గతాన్ని గురించి నవ్వుకోవలసిన పరిస్థితులలోకే యీ సంఘటన చేరితే సంతోషించవచ్చును. అదీకాక నాకు ఆత్మహత్య యిదివరకే జరిగిపోయింది. పోతే యిక మిగిలింది శరీరాన్ని త్యజించడం. అది యితరులకు నష్టం కలిగించే సందర్భంలో నా సహనాన్ని యింకొంచెం పెంపు చెయ్యడమే అభిలషనీయం అని గుర్తించాను. అందుకే యింక యింతకంటె ఎక్కువ అసహాయత పొందవలసి వచ్చినప్పుడు కూడ ధైర్యం ప్రకటించడానికి ప్రయత్నిస్తాను. యీపాటికే నేను చచ్చిపోయిఉంటే నీలాంటి అత్యంత సన్నిహితమైన స్నేహితురాలిని కోల్పోయి ఉండేదాన్ని కదా..." యింకా యింకా యిల్లా ఉంది ఉత్తరం అంతా. అంత తెలిసిన శారదకు నేనేమి రాయగలను? ఏవో విషయాలు రాసేదాన్ని. కొంతకాలంఉండి శారద మళ్ళీ భర్తయింటికి వెళ్ళిపోయింది.

"విశ్వం శారదపట్ల అనుమానం పెంచుకునేవాడు. ఆమె తన్ను ప్రేమించదని, తనంటే యిష్టపడదని అనుకుని బాధపడేవాడు. తను బాధపడడమే కాకుండా ఆమెను నిందించి క్రూరంగా ఆమె సుకుమార హృదయాన్ని గాయపరిచేవాడు. ఇల్లా కాలం

గడిచేకొద్దీ యీ పాడు ఆలోచనలతో వేడెక్కి అదివరకే ఒకసారి దెబ్బతిన్న మెదడు పాడైంది.

“శారదను మళ్ళీ పుట్టింటికి తీసుకువెళ్ళారు. శంకర్రావుగారికి, అల్లుడికి మనశ్చాంచల్యం కలిగిందనేమాట మనోవ్యథ యినుమడింపజేసింది. దాంతో ఆయనకు క్షయ అంకురమైంది. చాలా ఊళ్లు తీసుకువెళ్లి చాలా మందులిప్పించారు. రెండేళ్లు శానిటోరియంలో ఉండి తగ్గి డిస్‌ఛార్జి అయ్యారు. తనకున్న బంధువులల్లా అత్తారి తరఫువారే ఎక్కువ కావడంవల్ల వాళ్ల సంసారం శారద అత్తారి ఊరికే తర్లించారు. వారి భూములు కొన్నిగూడ అక్కడేఉండేవి. కాని ఆయన జబ్బు తగ్గినట్టే తగ్గి యింటికి వచ్చింతరవాత మళ్లీ ఎక్కువైంది. అప్పటికింకా స్ట్రెప్టోమైసిన్ వగైరాలు లేకపోవడంవల్ల నాలుగైదు నెలలు బాధపడి మరణించారు. ఇది శారదకు పెద్దషాక్. కాని పోయేముందుశంకరరావుగారు పిల్లలిద్దర్నీ శారదకువప్పగించి వారిని మానవులుగా తయారు చెయ్యవలసినబాధ్యత అప్పగించడంచేత విచారం దిగమింగి తనలోనే కుములుతూండేది. తండ్రి పోయినతరువాత శారద పరిస్థితి మరీ హీనంగా తయారైంది.

“శారద తమ్ముడు స్కూల్లో థర్డ్‌ఫారం ఏదో చదువుతూండేవాడు. శారద చెల్లెలు సుధకి మంచి సంబంధం చూసి పెళ్లిచేసి అత్తవారింటికి సాగనంపారు. అతను పూనాలో ఉద్యోగం చేస్తూండేవాడు. మామధ్య చాలా అరుదుగా ఉత్తరాలు సాగేవి. నా పెళ్ళి స్థిరపడింది. శారదని రమ్మని ప్రార్థిస్తూ ఉత్తరం రాశాను. కాని శారద పరిస్థితి నాకు తెలియనిది కాదు. ఏదో అసంతృప్తి ఏ మూలో పీడించి ఆమె రావడం అసంభవం అనిపించేది. పోస్టులో నా పెళ్ళినాడు శారదదగ్గరనుంచి పార్సెల్ ఒకటి వచ్చింది. తక్కిన విలువైన వాటికంటె శారద చేతితో పంపిన బహుమానమే నాకెక్కువ సంతోషాన్నిచ్చింది. ఆత్రుతగా విప్పిచూశాను. శరత్ పరిణీత, టాగూర్ రెక్. దానితోపాటు చిన్న స్లిప్ పేపర్. ‘స్వర్ణకి, నా జీవితంలో మా నాన్నగారు పోయిం తరువాత ఆనందం నశించింది. కాని యీ వార్త హృదయపూర్వకంగా సంతోషించే క్షణం కల్పించింది. పుస్తకాలు చూసి పెళ్ళి కానుకగా రెక్ పంపించానని ఏమీ అనుకోకు. భగ్నమైన నా హృదయం నీకుదగ్గర కావడంవల్ల, అమాయికమైన పుస్తకాలు పోస్టులో ఒకపొత్తున ఎల్లా వచ్చాయో, అల్లాగే మన యిద్దరి జీవితాలు పెనవైచుకున్న దానికి చిహ్నంగా యివి పంపిస్తున్నాను. ఇటువంటి శుభసమయంలో నా వేదన నీకు జ్ఞాపకం చెయ్యడం యిష్టంలేక మానేద్దామనుకున్నాను. కాని ఆలోచించినకొద్దీ నా నిర్లిప్తతే నిన్ను యింకా ఎక్కువ బాధపెడుతుందేమోనని తోచడంచేత యివి పంపిస్తున్నాను నీకు. ఇంతకంటె విలువైన యితరవస్తువులకంటె వీటినే ఎక్కువ ప్రేమిస్తావని తెలిసే యీ పనికి తలపెట్టాను. మీ యిద్దరి జీవితాలు పడుగు పేకల్లాగ హత్తుకుని యిద్దరి జీవితాలలో ఒకరి నొకరు అర్థంచేసుకుని సుఖమయ జీవితం గడపాలనే నా వాంఛ. నేను నిన్ను ఆశీర్వదించే తాహతు గలదాన్ని కాను. అంచేత యీ విషయంలో నా హృదయపూర్వక అభినందనలు అర్పిస్తున్నాను. నీ శుభంకాంక్షించే నీ శారద.’ మా వారికి తరువాత శారదనుగురించి చెప్పక తప్పలేదు. ఆయన చాలా విచారించారు. శారద తలపు వచ్చినప్పుడు ఆయనగూడ చాలాబాధపడుతుంటారు.

“విశ్వం ఆరోగ్యం పూర్తిగా బాగుపడలేదింక. మెదడు పనిచేసినన్నాళ్లు శారదమీద లేనిపోని అనుమానాలు పెంచుకుని వాటితో ఆలోచన లధికంచేసుకొని మెదడు పాడుచేసుకోవడం పిచ్చిలో ఉన్నన్నాళ్లు యీ ప్రపంచంతో సంబంధం లేకపోవడంగాఉండేది.

“ఎంతో ప్రేమించి కడుపులో పెట్టుకొని పెంచుతానని బీరాలు పలికి భ్రమ కల్పించిన సుందరమ్మగారు కొడుకు పిచ్చివాడైపోవడంతో అధికారవాంఛ, ధనకాంక్ష ప్రబలి శారదకు ప్రక్కలో బల్లెమైంది. దీనికితోడు సుభద్రమ్మగారు శంకరరావుగారుపోయినప్పటినుంచి ఆ వూళ్లోనే ఉండడంతో కూతురి తరఫున తల్లితోపోరాడేది. అల్లాగ మనస్సులో కావేషీలు పెరిగిపోయాయి.

“శారద బావగారు, మేనమామ అయిన రామనాథంగారు యీ అదను చూసుకొని తమ్ముడి ఆస్తికి అజమాయిషీ దారయ్యాడు. బాగాఉండీలేనిరోజుల్లో పవర్ ఆఫ్ ఎటార్నీ రాయించి పుచ్చుకొన్నాడు తమ్ముడిచేత. మహా ఆప్యాయత వెలగబెడతానని, తమ్ముడు కోర్టువ్యవహారాలు నెరవేర్చడానికి అది అవసరమని సాకు చెప్పాడు. పవర్ ఆఫ్ ఎటార్నీ చేతిలోకివచ్చిన తరువాత ఆయనలో విపశువాంఛలు రేకెత్తాయి. ‘లా’ తెలియని ఆడవాళ్లదగ్గర యిష్టం వచ్చినట్టు పేలేవాడు. ఎవరైనా ఎంతవరకు ఊరుకుంటారు. శారద సహనం అంతరించి ఒక్కొక్కప్పుడు ఎదిరించేది. యింట్లో బంధిస్తే పిల్లే చెలరేగి మీదపడి కరిచి పారిపోతుందే. అల్లాంటిది ఎంత సంస్కృతికి అలవడ్డా శారద ఎంతకని ఓర్పు వహించగలదు? ఆ కారణంగా ఆమెమీద వారి హయాములు యింకా ఎక్కువ అయ్యాయి.

రోజులు గడిచేకొద్దీ ప్రతి చిన్నవిషయంమీద చిలికి చిలికి గాలివానగా విజృంభించేది. సుభద్రమ్మగారికి జబ్బు చేసింది. ఆమె అవూళ్లోనే ఉండడం

చేత, పుట్టిల్లేగనక శారద వాళ్ళయింటికి వెళ్ళింది కొడుకుతో సహా. అతనప్పటికి స్కూల్ ఫైనల్ చదువుతుండేవాడు. శారద సంబంధం నాటినుంచే ఏదో పెరిగి హెచ్చుతుంటాయనుకున్న సంబంధాలు సడలి ద్వేషాలు పెరిగాయి. సుభద్రమ్మగారు యింట్లో ఉండడం తల్లికే కంటగింపుగా ఉండేది. సుభద్రమ్మగారు కూతురు అవస్థలు గ్రహించి తల్లితో తగవు పెట్టుకొనేది.

“ఒకరోజున విశాఖ్యానికి సంబంధించిన ఆస్తి విషయం అమ్మకం జరిపిస్తానని రామనాథంగారు తల్లిసుందరమ్మతో చెప్పాడు. పవర్ ఆఫ్ ఎటార్నీ ఉండడంవల్ల అది వీలైంది. తల్లి వెంటనే అంగీకరించింది. ఆస్తి అన్యాక్రాంతం కావడం యిష్టంలేని శారదా, సుభద్రమ్మగారు వ్యతిరేకించారు. అది హెచ్చుపెరిగిపోయి సుందరమ్మగారు పెద్దకొడుకు దగ్గరకు వెళ్ళిపోయింది. డబ్బు అదీ లేకుండా, పిచ్చి భర్తను అప్పగించి వెళ్ళిపోయింది క్రూరంగా ఆమె. శారద యింక సహించలేకపోయింది. భర్త ఆస్తి సమానంగా అనుభవించ గల హక్కు ఉండీకూడ దానికి దూరమవడం, భర్తతో కాపురం, పిల్లలు అల్లాంటి సుఖాలకి నోచుకోలేకపోవడంలో ప్రస్తుత పరిస్థితి ఆమెను పరాకాష్టకు తీసుకు వెళ్ళింది. తన జీవితంలో ఎప్పుడూ పోరాడుతూ ఓడుతూ ఉండడమే సంభవించేట్టుగా తోచింది. తండ్రి తనకు వప్పగించిన బాధ్యత చాలావరకు కొనసాగింది. సుధకు పెళ్ళయిపోయింది. తమ్ముడిచదువు ఒకదారిని పట్టింది. తను బ్రతికి యింక ఎవరికైనా చేయగల ప్రయోజనం ఏమీ కనబడలేదు. తన జీవితంలో భర్తకు తనకు పొత్తు కుదురుతుందనే ఆశ లేదు. ఆయన దృక్పథం విశాలం కాదు. తనను, తనబాధను గుర్తించ గల స్థితికి ఏనాడైనా వస్తాడనే ఆశకూడా లేదు. తల్లితో విరక్తిగా జీవితాశ లేనిదానిగా వ్యవహరించ మొదలు పెట్టింది. తమ్ముడికి జీవితంలో మానవత్వం పొందడానికి తగినన్ని సలహాలిచ్చింది. తల్లి కాంద ప్రవర్తన వేయికళ్లతో కనిపెట్టింది. కాని చచ్చిపోదామని స్థిరనిశ్చయం చేసుకున్నవాళ్లని ఎవరూ ఆపలేరు. నాకు కడసారి ఉత్తరం రాసి శారద శెలవు తీసుకుంది. “స్వర్ణా యీ ఉత్తరం నీ కందేటప్పటికే నేను యీ సంఘపు కట్టుబాట్లకు అతీతమైన ప్రదేశంలో ఉంటాను. నాన్నగారు నాకు అప్పగించిన బాధ్యత చాలావరకు నెరవేర్చాను. నాకు జీవితంలో పొందగల ఏ ఆశయమూ లేదు. ఇంక నా బ్రతుకు ఏమీ ఉపయోగం ఉండదు. ఇంక అయిదారేళ్లలో తమ్ముడికి తన కాళ్లమీద నిలబడగల శక్తి వస్తుంది. దానికి పునాది బాగానే ఉంది. నాకు మిగిలిన విచారమల్లా నిన్ను వదలి వెడుతున్నాననే. నీలాంటి స్నేహితులు సాధారణంగా ఎవరికీ దొరకరు. పునర్జన్మలో నేను నీ సాన్నిహిత్యం కాంక్షిస్తూ సెలవు తీసుకుంటున్నాను. నా గురించి నువ్వు అస్తమానం తల్చుకుని విచారించవని నీ దగ్గర ప్రమాణం తీసుకుంటున్నాను. నా చరిత్ర చెప్పి అనవసరంగా నువ్వు బాధపడి యింకొకరిని బాధపెట్టవద్దని నా ప్రార్థన. ఈ ప్రపంచంలో కొందరు ఎందుకు పుడతారో నా కర్థం కాదు. పుట్టినప్పటినుంచే కష్టాలే అనుభవిస్తారు. లోకం సానుభూతైనా పొందలేకుండా వెళ్ళిపోతారు. వారికై విచారించేవారుండరు. సంఘంలో యిది అతి సామాన్య విషయం. ......... నిన్ను వదలలేక, తప్పక, నీ దగ్గర శాశ్వతంగా సెలవు తీసుకుంటున్న నీ అభాగ్య నేస్తురాలు. శారద!” స్వర్ణ ఆపుకోలేక ఏడ్చేసింది. సంధ్యకూడ వంతపాడింది...

సంధ్య కొంతవరకు అదుపు తెచ్చుకుని,

“అయిపోయిందా?” అని అడిగింది.

“శారద కథ ముగిసినట్టే. కాని వాళ్ళ కుటుంబం గొడవ పూర్తికాలేదు. సుభద్రమ్మగారా పరిస్థితినుండి కోలుకోలేదు. ఇదంతా తన దుష్కార్య ఫలితమేనని క్షణక్షణానికి ఆమెకు జ్ఞప్తికివచ్చి అసలే బాగులేని ఆమె ఆరోగ్యం కృష్ణపక్ష చంద్రునిలా క్షీణించి ఆమె ప్రాణాన్ని బలిగొంది. సుధా ఆమె భర్తా వచ్చారు. ఎంతో విచారించారు. చెయ్యగలిగిందేం లేక సుధ తమ్ముణ్ణి తనతో తీసుకు వెళ్ళిపోయింది. అల్లాగ ఆ కుటుంబపు అభాగ్య చరిత్ర ముగిసింది.” అని భోరున ఏడ్చింది స్వర్ణ.

సంధ్య తన బలమంతా ఉపయోగించి రెండో సారి వస్తూన్న దుఃఖాన్ని ఆపుకోగలిగింది కాని అశ్రుధారలని అరికట్టలేకపోయింది.

“ఎవ్వరికీ చెప్పకుండా ఎంతకాలమని నీలో నువ్వు కుములుతావు? ఎవరికైనా తెలిసి గతాన్ని పునరుద్ధరించగలరనికాదు నేననేది. రెండేళ్ళనించీ తెలిసిఉండీకూడ నీ కష్టంలో పాలు పంచుకోలేకపోయానే, అనే నా బాధ.”

“నువ్వివాళ యింత పట్టుపట్టావు గనకనూ, దైవికంగా ఆ ఆల్బం బయటపడింది గనకనూ యీ గాథ వెలికి వచ్చింది. మనం బాధపడి చెయ్యగలిగిందేమిటీ?”

“అరికట్టడానికి ప్రయత్నించాలి. ప్రతీ మనిషిలోను పరివర్తన కలిగించడానికి ప్రయత్నించాలి. సమాజాన్ని పునరుద్ధరించాలి. అంతేగాని చేతకానితనంగా ఊరుకుండుకు వీల్లేదు. ఇంక యివాళకి మహిళా సమాజానికి వెళ్ళడానికి వీల్లేదు. యింటికి వెళ్లిపోతాను. సెలవు.”

అంతసేపూ ఏమీ అర్థంకాక అక్క ఏడ్చినప్పుడల్లా ఏడ్చి ఎఱ్ఱని కళ్ళతో ఉన్న సతీశుణ్ణి ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది సంధ్య.